# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-08-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **దేశంలోని ప్రతి ఒక్కరికీ బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో జన్‌ధన్ యోజన కీలక పాత్ర పోషిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

2. **రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే చెత్తను అదే రోజు విద్యుత్‌గా మార్చేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పి.నారాయణ తెలిపారు.**

3. **వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లాకు తాగు, సాగు నీరు అందించనున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.**

4. **ప్రతి ప్రాంతానికి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.**

=========================

ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన పథకం గొప్ప ఫలితాలను సాధించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 2014లో ఇదే రోజున జన్‌ధన్ యోజనను ప్రారంభించగా ఈ పథకం కింద ఇప్పటివరకు 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలు తెరవగా, వాటిలో 3 లక్షల 17 వేల కోట్ల రూపాయలకుపైగా డిపాజిట్లు ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత కార్యక్రమంగా జన్‌ధన్ యోజన… దేశంలోని ప్రతి ఒక్కరికీ బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఈ పథకం కింద తెరిచిన ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాలకు చెందినవని, సుమారు 56 శాతం ఖాతాలు మహిళల పేరిట ఉన్నాయని తెలిపారు.

-------------------------

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కృష్ణంపాలెం గ్రామస్తులు కాలుష్యం నుంచి కాపాడాలంటూ చేసిన విజ్ఞప్తిపై ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ స్పందించారు. ఆయన ఆదేశాలతో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సంబంధిత సంస్థలో తనిఖీలు నిర్వహించారు. పరిశ్రమలో యంత్ర పరికరాల ప్రారంభ సమయంలో కలప వ్యర్థాలను ఇంధనంగా వినియోగించడం వల్ల కాలుష్య వాయువుల ద్వారా కృష్ణంపాలెం గ్రామం, పునరావాస కాలనీ వైపు వ్యాపిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కాలుష్య నియంత్రణ పరికరాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి, నిబంధనల ప్రకారం శుద్ధి చేసిన ఉద్గారాలను తగిన ఎత్తులోని చిమ్నీ ద్వారా విడుదల చేసిన తర్వాతే కార్యకలాపాల ప్రక్రియ చేపట్టాలని అధికారులు సంస్థ యాజమాన్యానికి సూచించారు.

---

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఆరు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే చెత్తను అదే రోజు విద్యుత్‌గా మార్చేలా చర్యలు తీసుకుంటున్నామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. పాత వ్యర్థాల తొలగింపు, వ్యర్థాల శుద్ధి కేంద్రాల ఏర్పాటు పనులపై అమరావతి సచివాలయంలో మంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగానారాయణ మాట్లాడుతూ, 150 లక్షల టన్నుల పాత వ్యర్థాలను పూర్తిగా తొలగిస్తున్నామని తెలిపారు. ఉత్పత్తి అయ్యే ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తున్న ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రాన్ని డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నారాయణ తెలిపారు.

---

వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లాకు తాగు, సాగు నీరు అందించనున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మార్కాపురం కలెక్టర్ కార్యాలయంలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, రెండేళ్లలోనే వెలిగొండ ప్రాజెక్టులోని ఫీడర్ కెనాల్‌కు సంబంధించి 11 కిలోమీటర్ల లైనింగ్ పూర్తి చేశామని వివరించారు. వెలిగొండ నిర్వాసితులకు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 27 సెకన్లు

---

డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఓడలరేవు నుంచి సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు ఈ రోజు రాష్ట్రానికి చేరుకున్నారు. ప్రభుత్వ సహకారంతో పశ్చిమబెంగాల్ నుంచి అధికారులు వారిని కాకినాడకు తీసుకొచ్చారు. ఈ నెల 3వ తేదీన చేపలవేటకు వెళ్లిన వారి బోటు గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు పశ్చిమబెంగాల్‌లోని శంకర్‌పూర్ జెట్టి వద్ద మత్స్యకారుల ఆచూకీ గుర్తించారు. వారిని రాష్ట్రానికి తీసుకురావడంతో కాకినాడకు చేరుకున్న మత్స్యకారులకు స్థానిక శాసనసభ్యులు వి.కొండబాబు, మండలిసభ్యులు రాజశేఖర్ స్వాగతం పలికారు.

---

అభివృద్ధికి రహదారులే కీలకమని, ప్రతి ప్రాంతానికి మెరుగైన రవాణా సౌకర్యంతో పాటు రహదారి అనుసంధానం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురంమన్యం జిల్లాలోని జాతీయ రహదారి ఎన్‌హెచ్-26 నుంచి విశ్వనాథపురం మీదుగా కొత్తవలస వరకు 8 కిలోమీటర్ల మేర చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సుమారు 4 కోట్ల 43 లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నామని చెప్పారు. రహదారి నిర్మాణం పూర్తయితే పలు గ్రామాలకు రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుందని తెలిపారు.

---

ప్రతి ఒక్కరూ రోజూ వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆవరణలో

విద్యార్థులతో కలిసి ఆయన ఈరోజు ఉదయపు నడకలో పాల్గొన్నారు.అనంతరం మాధవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఫిట్ ఇండియా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించాలని పీవీఎన్ మాధవ్ సూచిస్తూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

జనసేన పార్టీ శాసన మండలి సభ్యులు కొణిదెల నాగబాబు ఆంధ్రప్రదేశ్ గ్రీన్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, వృక్ష విస్తీర్ణాన్ని 50 శాతానికి పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ఏపీ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా నాగబాబుకు ఈ బాధ్యతలు అప్పగించగా, ప్రభుత్వం ఆయనకు కేబినెట్ ర్యాంకు హోదా కల్పించింది.

---------------------------

తిరుపతిలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీని ఈ రోజు నిర్వహించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీల్లో విజేతలైన క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు. తారకరామ స్టేడియం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు సాగిన ర్యాలీని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తిరుపతిని మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, విద్య, క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

---------------------------

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ - ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో ఎటువంటి లోపాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని శ్రీసత్య సాయి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ.శ్యామ్ ప్రసాద్ అధికారులకు సూచించారు. పుట్టపర్తిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణ, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రక్రియ, అధికారులు చేపడుతున్న చర్యలపై జిల్లా ఎన్నికల ఓటర్ల జాబితా పరిశీలకులతో కలిసి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అనర్హులు, మరణించినవారి పేరు నమోదులను పరిశీలించాలని సూచించారు.

---------------------------

చేనేతల సంక్షేమం, ఆర్థిక భద్రతకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో 'నేతన్న సేవలో' పథకం అమలుపై సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు.

======================